అధికారులు ఉన్నట్టా.. లేనట్లా..?



రమణక్కపేట వద్ద ప్రధాన రోడ్డుపై నుంచి పారుతున్న వరద నీరు



మల్లూరు బస్టాప్ వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు

- పూడుకుపోయిన కల్వర్టులు
- ప్రధాన రోడ్డుపైనుంచి పారుతున్న వరద
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

మంగపేట: ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు పర్యవేక్షించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నట్టా.. లేనట్టా.. అనే సందేహం కలుగుతుంది ఇక్కడి ప్రజలకు.. మండలంలో 24 గంటలు ఇసుక లారీలతోపాటు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మండలంలోని ప్రధాన రోడ్డు మీదుగా ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తోండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా సరిహద్దులోని బ్రాహ్మణపల్లి నుంచి కమలాపురం వరకు గల ప్రధాన రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. రోడ్డుపై వర్షపునీరు నిలిచి ఉండడంతో ప్రమాదకరంగా మారింది. అయినప్పటికీ సంబంధిత అధికారులు కనీస మరమ్మతులు చేపట్టకుండా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యమే కారణం

మండలంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రహదారి పూర్వం గ్రామాలకు చివరన పంట పొలాల మీదుగా ఉండేది. 25 ఏళ్ల నుంచి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా కమలాపురం మొదలుకుని జిల్లా సరిహద్దు వరకు ప్రస్తుతం ఇళ్లు ఏర్పడ్డాయి. రాజుపేట, నుంచి మొదలుకుని, రమణక్కపేట, మల్లూరు, బరోనర్సాపురం, మంగపేట గ్రామాల్లో ఆర్అండ్ బీ రోడ్డు పరిధిలో కాల్వలు, కల్వర్టులు పూడ్చి రోడ్డుకు 05 ఫీట్ల ఎత్తు మట్టిని నింపి ఇళ్లను నిర్మించారు. విషయంపై అప్పటి ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు కల్వర్టుల నుంచి బయటకు పోయే అవకాశం లేకపోవడంతో ఆయా గ్రామాల్లో ని ఇళ్లలోకి చేరుతోంది. భారీ వర్షాలు పడితే ఇళ్లలోకి నీరు చేరడంతోపాటు రోడ్డుపై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు ధ్వంసమై భారీ గోతులు ఏర్పడుతున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో జనవాసాల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం 11 గ్రామాల మధ్య నుంచి ప్రధాన రోడ్డు ఉండడం రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు లేకపోవడం, కల్వర్టులు పూడుకుపోయి నీరు బయటకు వెళ్లడం లేదు. అయినప్పటికీ అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటన్నారే.. తప్ప పూడుకుపోయిన కల్వర్టుల నుంచి నీరు బయటకు వెళ్లేందుకు శాశ్వత చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

జాప్యానికి అంతర్యమేంటో..?

మంత్రి సీతక్క చొరవతో ఏటూరునాగారం ఎన్‌హెచ్ 163 నుంచి మంగపేట వరకు, ఏటూరునాగారం –బూర్గంపాడు ప్రధాన రోడ్డుతోపాటు మంగపేట నుంచి కాటాపురం వెళ్లే రోడ్డు, కాజ్ వేల మరమ్మతులు చేపట్టేందుకు రూ.20.40 లక్షలు మంజూరీ చేసింది. మరమ్మతు పనులు చేపట్టిన గుత్తేదారు ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో వెట్‌మిక్స్‌తో నింపి బీటీ వేయాలి. కానీ, కమలాపురం– ఏటూరునాగారం మధ్యలోని జీడివాగుపై నిర్మించిన కాజ్‌వేపై ధ్వంసమైన సీసీరోడ్డును తొలిగించి ఆ వేస్ట్ మెటీరియల్‌ను జీడివాగు నుంచి మంగపేట వరకు ఏర్పడిన గోతుల్లో నింపివదిలేశాడు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయలేదు. ఇంతజరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకుండా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా రోడ్డుపై వేసిన బీటీ ఆరు నెలలకే ఊడిపోయింది. మండలంలోని కమలాపురం, బోరునర్సాపురం, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి వద్ద రోడ్డు వేసిన కొద్దికాలానికే ధ్వంసమై అధికారుల నిర్లక్ష్యానికి సాక్షంగా నిలుస్తుంది.

మట్టిని తొలిగించాలి



మండలంలో ప్రధాన రోడ్డుపై నిర్మించిన కల్వర్టులు పలు గ్రామాల్లో మట్టితో పూడుకుపోయాయి. వర్షాకాలంలో వరద బయటకు వెళ్లకపోవడంతో ఇళ్లలోకి చేరుతోంది. పదేళ్ల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద మట్టిని తొలిగించాలి.

– ఆదినారాయణ, మండల అధ్యక్షుడు, మన్యసీమ పరిరక్షణ సమితి

జనావాసాలు అడ్డుగా ఉన్నాయి

మండలంలో రోడ్డు వెంట ఇళ్లు నిర్మించుకున్నవారు మట్టిని నింపడంతో పలు చోట్ల కల్వర్టులు పూడుకుపోయాయి. వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద కల్వర్టుల నుంచి వెళ్లడంలేదు. కల్వర్టుల వద్ద ఇళ్లు ఉండడంతో నీటిని బయటకు వెళ్లే విధంగా కాల్వలు తీసే వీలు లేదు. విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– వెంకటేష్ ఆర్అండ్‌బీ ఏఈ, ఏటూరునాగారం

గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్‌లో రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను గ్రామపంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం తొలగించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఈనెల 29 నుంచి అమల్లోకి రావడంతో గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు రోడ్ల వెంట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. వాల్ రైటింగ్‌ను చెరిపేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభకాంక్షలు తెలుపుతూ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు.

విగ్రహాలకు ముసుగు..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ సిబ్బంది రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగువేశారు. పార్టీల వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తటి శ్రీను, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.



ఎస్ఎస్‌తాడ్వాయి: నార్లాపూర్‌లో..



వెంకటాపురం(కె): విగ్రహాలకు క్లాత్ కడుతున్న పంచాయతీ సిబ్బంది


రిజర్వేషన్‌పై ఆరోపణలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రవిచందర్

ములుగు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై తప్పుడు ఆరోపణలు సరికాదని గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల కమిషన్ జిల్లాల వారీగా సర్వేలు నిర్వహించి రిజర్వేషన్లు ఖరారు చేస్తే.. మంత్రి తనయుడి కోసం రిజర్వేషన్ అనుకూలంగా చేయించారని అనడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో నామినేటెడ్ పదవులు కష్టపడ్డవారికి ఇచ్చిన ఘనత మంత్రి సీతక్కదని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రిజర్వేషన్ రాకపోవడంతో అసహనంతో ఉన్నారంటూ తప్పుడు ప్రచారాలు చేయడం సబబుకాదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, వంగ రవియాదవ్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

దుర్గామాతగా అమ్మవారి దర్శనం



ఏటూరునాగారం: అభిషేకం చేస్తున్న అర్చకులు



గోవిందరావుపేట: మచ్చాపూర్‌లో..



ఏటూరునాగారం: వేప మండలు, నిమ్మకాయలతో అలంకరించిన దుర్గాదేవి ప్రతిమ



ములుగు రూరల్: ఇంచర్లలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలోని రామాలయ ఆవరణలో మంగళవారం అమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలు కల్యాణి డెవలపర్స్, పైడమల్ల సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఇంచర్లలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మునిసపల్లి కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం ప్రారంభించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, చాంద్‌పాషా, రాములు, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

మచ్చాపూర్‌లో..

గోవిందరావుపేట: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మచ్చాపూర్ గ్రామంలో శ్రీ దుర్గాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు వేద పండితులు బోగోజు క్రాంతి కుమార్ ఆచార్యులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. చల్వాయి, గోవిందరావుపేట, పస్రా, గాంధీనగర్ గ్రామాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం గ్రామమ్లో మంగళవారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దరశన మిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి, భక్తులకు ప్రసాదాలను ఇచ్చారు.

హోమం, అన్నదానం

ఏటూరునాగారం: శ్రీదేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. రామాలయంలో దుర్గాదేవి అమ్మవారికి నిమ్మకాయలు, వేప మండలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలను చేశారు. అమ్మవారికి భవాని స్వాములు, మాతలు, భక్తులు ఒడిబియ్యం పోసం చీరె సారెలను సమర్పించారు. అనంతరం దుర్గామాత శరణు ఘోషతో ఆలయం మార్మోగింది. ఇదిలా ఉండగా.. ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు.



హోమంలో పాల్గొన్న సీఐ శ్రీనివాస్, ఎస్సై



వాజేడు: పూజలో పాల్గొన్న భక్తులు

గంగ ఒడికి గౌరమ్మ

- ఘనంగా సాగనంపిన ఆడబిడ్డలు
- చివరి రోజు సంబురంగా ఆడిపాడిన యువతులు, మహిళలు

పెద్దల అమావాస్య రోజున ఎంగిలిపూల వేడుకగా ప్రారంభమైన బతుకమ్మ సంబురాలు జిల్లాలో మంగళవారం సద్దుల బతుకమ్మతో ముగిశాయి. చివరి రోజున చిన్నారులు, యువతులు, మహిళలు చెరువుగట్లు, బతుకమ్మ మైదానాల వద్ద బతుకమ్మ పాటలు పాడుతూ.. నృత్యాలు చేస్తూ సంబురంగా గౌరమ్మను గంగ ఒడికి చేర్చారు. పోయిరా.. బతుకమ్మ పోయిరావమ్మా.. అంటూ పాటలు పాడారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.. ఫలహారాలు పంచిపెట్టారు.

వెంకటాపురం(ఎం): మండలంలో సద్దుల బతుకమ్మ వేడుకలను మంగళవారం మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని తాళ్లపహాడ్ సెంటర్‌కు బతుకమ్మలతో పెద్ద ఎత్తును చేరుకున్న మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. అనంతరం స్థానిక లింగయ్యకుంటలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా వెంకటాపురం ఎస్సై చల్లా రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మంగపేట: మండలంలో పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ పండుగను మంగళవారం జరుపుకున్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ పండుగను సోమవారం జరుపుకున్నారు. సాయంత్రం 06 గంటల నుంచే గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబురాలు ప్రారంభమాయ్యాయి. పలు గ్రామాల్లో రాత్రి 02కు మరికొన్ని గ్రామాల్లో తెల్లవారు జామున 03 గంటల వరకు జరుపుకున్నారు.



ములుగులో బతుకమ్మ పేర్చుతున్న మహిళ



జిల్లాకేంద్రంలో వినూత్న బతుకమ్మ



మంగపేట: మండల కేంద్రంలోని టీచర్లకాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు







బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మంత్రి సీతక్క, మహిళలు



జిల్లా కేంద్రంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న యువతులు, మహిళలు

వైద్య సేవలు అందించడమే లక్ష్యం

చిట్యాల: పేద ప్రజలకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య సేవలు అందిచడమే లక్ష్యం అని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా టీం లీడర్ యామంకీ అనిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డును డాక్టర్ క్రాంతితో కలిసి సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశ పెట్టిందన్నారు. దినిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య మిత్రలు గుర్రపు రాజమౌళి, స్వప్నదేవి ఉన్నారు.

పత్తి చేనులో కొండెంగ ఫ్లెక్సీ



పత్తి చేనులో రైతు ఏర్పాటు చేసిన కొండెంగ ఫ్లెక్సీ

రేగొండ: మండల కేంద్రానికి చెందిన ఓ రైతు తన పత్తి చేను రహదారి పక్కనే ఉండటంతో నిత్యం కోతులు సంచరించి పంటను ధ్వంసం చేస్తున్నాయి. పత్తి చేను పూత, కాత దశలో ఉండటంతో కోతుల బీభత్సంతో కొమ్మలు విరిగి పూత, కాయలు రాలుతున్నాయి. దీంతో ఆలోచించిన రైతు పత్తి చేనులో కొండెంగ ఫ్లెక్సీని ఏర్పాటు చేశాడు. కాగా అటువైపు వెళ్తున్న ప్రయాణికులు ఫ్లెక్సీని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

క్లుప్తంగా

మొదలైన రావణవధ కార్యక్రమ ఏర్పాట్లు



గోవిందరావుపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరగనున్న రావణాసుర వధ కార్యక్రమం ఏర్పాట్లు మండల పరిధిలోని పస్రా గ్రామంలో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొదలయ్యాయి. ఈ సందర్భంగా దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బూర సురేందర్ మాట్లాడుతూ.. ఉత్సవాలు జరిగే స్థలంలో లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దసరా సంబురాలను ఆకర్షణీయంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మండల ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సవంలో పాల్గొనాని కోరారు. కార్యక్రమంలో ముద్దబోయిన రాము, పులుగుజ్జు వెంకన్న, జీవంజి జనార్దన్, బొమ్మగాని శ్రీనివాస్, మడిపెల్లి శ్యాంబాబు, గొంది కిరణ్, జక్కు రణధీర్, సంసోత్ రాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కన్నాయిగూడెం: వాజేడు మండలం పెద్ద గంగారం గ్రామానికి చెందిన మాజోజి నరేందర్ 5 నెలల కుమార్తెకు అనారోగ్య సమస్యలు ఏర్పడడంతో ఓ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు రూ.5లక్షలు అవసరమని వైద్యులు చెప్పారు. దీంతో నిరుపేద కుటుంబానికి చెందిన నరేందర్ దాతలు సాయం చేయాలని సామాజిక మాధ్యమాల ద్వారా కోరాడు. స్పందించిన మండలంలోని ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు రూ.22వేలు గ్రూప్ అధ్యక్షుడు అబ్బు సతీష్ ద్వారా బాధితులకు మంగళవారం అందించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీలో సబ్జెక్ట్ తప్పిందని..

- మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి మృతి

ఖిలా వరంగల్: డిగ్రీలో ఒక సబ్జెక్ట్ తప్పిందని మనోవేదనకు గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన రాయబారపు శ్రీనివాస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వరంగల్ శివనగర్‌లో ఉంటున్నాడు. చిన్నకుమారుడు అరుణ్‌కుమార్ డిగ్రీ ఉత్తీర్ణత కాకపోవడంతో కంప్యూటర్ నేర్చుకునేందుకు వరంగల్‌కు వచ్చి తన సోదరుడి ఇంట్లో ఉంటున్నాడు. గత నెల 26న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు.

కుక్కపిల్లను ఎత్తుకెళ్లిన కోతి



రేగొండ: కోతి కుక్క పిల్లను ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని తిరుమలగిరిలో చోటు మంగళవారం చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అప్పుడే పుట్టిన కుక్క పిల్లను వానరం తన పిల్ల అనుకుని చేతుల్లోకి తీసుకుని ఎత్తుకెళ్లింది. కోతిపిల్లలాగే కడుపుకు హత్తుకుని ఇళ్లపై తిరిగింది. ఇక తన పిల్ల కోసం తల్లి కుక్క ఆ కోతి వెనుకే తిరగడం గమనార్హం. అయితే కోతి వెంట ఎంత తిరిగినా ఆ కోతి మాత్రం కుక్క పిల్లను వదలలేదు. దీంతో తల్లి కుక్కను చూసిన మరికొన్ని వీధి కుక్కలు తోడయ్యాయి. అన్ని కలిసి కోతిని వెంబడించాయి. అయినా కూడా కోతి మాత్రం కుక్క పిల్లను వదలలేదు. ఇది గమనించిన స్థానికులు ఆ కోతి చేతి నుంచి కుక్క పిల్లను విడిపించడం కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. కుక్క పిల్లను కింద పడకుండా గట్టిగా పట్టుకుని చెట్లపై నుంచి గ్రామం అంతా తిరుగుతుంది. గ్రామంలో ఇళ్లపైన కుక్క పిల్లతో కోతి సంచరిస్తుంటే కింద తల్లి కుక్క తల్లడిల్లుతున్న తీరు చూపరులను అయ్యో పాపం అనిపించింది.

పోలీసులు పద్ధతి మార్చుకోవాలి

కాటారం: పోలీసుల వ్యవహార శైలి శృతిమించి పోతుందని పద్ధతి మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా బెయిల్ మంజూరైంది. మంగళవారం మధు మండల కేంద్రంలో జోడు శ్రీనివాస్‌ను పరామర్శించారు.